

# దొంగలు

ముద్దంశెట్టి హనుమంతరావు

పట్నానికీ, మావూరికీ సుమారు మూడుమైళ్ళదూరం వుంటుంది.

సాధారణంగా పట్నం వెళ్ళడానికి సైకిలు వాడే అలవాటు నాకులేదు యెప్పుడో అంత అర్జంటయితే తప్పించి. నడుస్తూ వెళ్ళిరావడమే యెంతో సరదాగా వుంటుంది. నాతోపాటు, యెవరో ఒకారు యెప్పుడూ వుంటారుగాబట్టి, మాటామంతీ ఆడుకునిపోవడం పరిపాటయ్యింది.

ఆరోజు పట్నం వెళ్తుంటే, రాజారావు నాతో బైలుదేరాడు. బ్యాంకు నించి ఓ అయిదువేల రూపాయలు విత్‌డ్రా చేసి తీసుకురావల్సివుంది

గాబట్టి, జీప్ బాగ్ కూడా పట్టుకున్నాను. రాజారావు వెంటవుంటాడని, మరెవర్నీ తీసుకుపోలేదు.

\ బ్యాంకునించి డబ్బు తీసుకుని, మిగతా మరికొన్ని పనులు ముగించుకునేసరికి, సాయంత్రం అయిదు దాటింది. ఎండతగ్గినా, వేడిగాలి మాత్రం వీస్తూనేవుంది.

నాగేశ్వరరావు నటించిన 'బంగారుబాబు' చిత్రం విడుదలై వారం రోజులయ్యింది. ఎక్కడ చూసినా, ఆ చిత్రం తాలూకు స్టిల్స్ గోడల మీద ఆకర్షణీయంగా అగుపిస్తున్నయ్. నా అభిమాన నటుల్లో నాగేశ్వరరావు ఒకడు గాబట్టి. ఆ చిత్రం చూసివెళ్తే బావుంటుందేమోనన్న ఆలోచన తళుక్కున మెరిసింది. కాని, వెంటనే గుర్తుకొచ్చింది యింతడబ్బు దగ్గర పెట్టుకొని, సినిమాకి వెళ్ళడం, ఆరాత్రిపూట మావూరువెళ్ళడం శ్రేయస్కరంకాదని.

ఒకవ్యక్తి ఆలోచనలు, యెదురుగావున్న వ్యక్తి మస్తిష్కంలోకి ప్రసారమౌతాయో యేమో తెలీదుగాని, ఆ దేసమయంలో రాజారావు అన్నాడు, "రామారావుగారూ, బంగారుబాబు' చూచి వెళ్దామండీ' అని.

రాజారావు నాకంటె వయస్సులో రెండు మూడేళ్ళు పెద్దవాడే అయినా, మా అంతస్తునిబట్టి, నన్ను బహువచనంలో సంభోధిస్తూవుంటాడు; ఇది మొదట్నుంచీ అతనికి అలవాటే.

"సరిగ్గా యిదే ఆలోచన నాకూ వచ్చింది రాజారావ్ కాని,ఒక్కటే అడ్డొస్తున్నది." అన్నాడు.

"ఏమిటండీ?"

"మరేంలేదు....నాదగ్గర యింత డబ్బు పెట్టుకుని సినిమాకి వెళ్ళడం, ఆ రాత్రిపూట మనవూరికి బైలుదేరడం, ప్రమాదకరమేమో." నని భయాన్ని వ్యక్తంచేశాను.

రాజారావు తేలిగ్గా ఓ నవ్వు నవ్వేడు. "మీలాంటి వ్యక్తి యిలా అనడం, నాకు నవ్వొస్తోందండీ రామారావుగారూ! మనం యెన్నిసార్లు రాత్రిపూట మనవూరు వెళ్ళలేదు! ఆత్రోవ మనకి కొత్తదేం కాదు. అందులోనూ, వెన్నెలరాత్రుళ్ళాయె! చల్లనివేళ, సరదాగా కబుర్లుచెప్పుకుంటూ వెళ్ళిపోవచ్చు. సినిమాచూసి వెళ్దామండీ!" అన్నాడు, మొదట్లో నాలో మెదిలిన కోరికను బలీయంచేస్తూ.

నేను, కాదనలేకపోయాను.

'సరే! హాలుదగ్గరికి పద..' అంటూ ముందుకి సాగాను.

పెద్దతరగతిటిక్కెట్లకోసంకూడా జనం కొట్టుకుంటున్నారు. ఈ సినిమాపిచ్చి, అన్నినిషాలకంటె పెద్ద 'నిషా' అనిపించిందప్పట్లో. రాజా

రావు ఆ దొమ్మిలోకి వెళ్ళి, బట్టలు నలువుకొని, రెండుటిక్కెట్లు తీసుకుని, వీరుడిలా బైటికొచ్చాడు.

ఇద్దరం హాల్లో కూచున్నాం. చిత్రం చూస్తున్నంతసేపూ విసుగనిపించలేదు. నా జిప్ బ్యాగ్ నీ ఎంతో పదిలంగా పట్టుకున్నాను. దృష్టి, సినిమామీదున్నా, ఆలోచనమాత్రం జిప్ బ్యాగ్ గురించే !

సినిమా విడిచిపెట్టేసరికి, తొమ్మిదింబావు అయ్యింది. ఆలస్యంచెయ్యకుండా, యిరువురం అడ్డుత్రోవన బైలుదేరాం మావూరికి.

వెండిపరిచినట్టుగా, తెల్లనివెన్నెల కాస్తోంది. శరీరానికి హాయిగొలిపే చల్లనిగాలి వీస్తోంది. ఆ వాతావరణంలో నడవడమే యెంతో వుల్లాసాన్ని కలిగించింది. త్రోవపొడుగునా సినీమాలోని సంఘటనల్ని గురించే మాట్లాడుకుంటూ సాగిపోతున్నాం.

కాలవ దాటాం. ఎదురుగా కాస్తంత దూరంలో గుబురుగా, ఓ పెద్ద రాక్షసి కూచున్నట్టుగా అనుపిస్తోన్న జీడితోట మనస్సులో కాస్తంత పిరికితనాన్ని రేకెత్తించింది. సాధారణంగా దొంగతనాలు, దోపిడీలు, ఆ తోటలోనే జరుగుతూ వుంటాయ్. మామూలు రోజుల్లో అయితే, నిర్భయంగా వుండేవాడ్ని. కాని, ఆరోజు నా దగ్గర అయిదువేలరూపాయలున్నాయి నిజం చెప్పొద్దూ నాకు గుండెల్లో ఒకవిధమైనదడప్రారంభమయ్యింది.

'రాజారావ్, జీడితోట దగ్గర మనం కాస్తంత అప్రమత్తతో వుండాలోయ్....' అన్నాను.

రాజారావు నవ్వేడు. ఆ క్షణంలో అతన నవ్వుని నేను హర్షించలేకపోయాను. ఒకవేపు నాకు గుండెల్లో గుబులుగావుంటే, అతనికి నవ్వొస్తోందా ?

'నవ్వుతావేవిఁటోయ్ ?' అన్నాడు కాస్తంత విసుగ్గా.

'మీరు యింత పిరికివార ! నాకు యింతవరకూ తెలీదు రామారావుగారూ: ఈ ప్రాంతల్లో మిమ్మల్ని యెరుగని వాడెవడండీ! మిమ్మల్ని దోచుకోడానికి,యెవడికయినాగుండెలుండొద్దూ?' అన్నాడు.

నాలో కాస్తంత ధైర్యం వుంజుకుంది. ముందుకి సాగిపోయాం

జీడితోటమధ్యగా నడుస్తున్నాం. కీచురాళ్ళ ధ్వని స్పష్టంగా వినిపిస్తోంది. గాలికి యెండుటాకులు రాలిపడుతున్న శబ్దం. అస్పష్టంగా వినవస్తోంది.

'ఆగండి....' గంభీరమైన గొంతు వినిపించింది.

నిజంగానే నేను భయంతో వొణికిపోయాను. ఆ రాత్రికి పట్నంలో వుండిపోయినా బాగుండిపో ననిపించింది. కాని, యిప్పుడు అనుకొని

యేంలాభం! వొణుకుతోన్న చేతి వేళ్ళతో జిప్ బాగ్ ని మరింతగట్టిగా అదిమి పట్టుకున్నాను.

'రాజారావ్....' వొణుకుతున్న స్వరంతో మెల్లగా అన్నాను.

'ఎవరై వుంటారుచెప్మా?' అని ఆలోచనల్లో పడ్డాడు రాజారావు.

నల్లని ఆకారం మావేపు వస్తోంది. ఆ ఆకారం దగ్గర పడుతున్నకొద్దీ, నా గుండెలు మరింత జోరుగా కొట్టుకోవడం ప్రారంభించాయి. ఆ వ్యక్తి నా దగ్గరగా వొచ్చి, మొహంలోకి చూశాడు. వెన్నెల రాత్రులుగాబట్టి నా మొహం గుర్తు పట్టగలిగాడో యేమో–

దండాలు బాబయ్యా! తవరా! ఈ రాత్రేళ యిట్టావస్తుండారెందుకు బాబయ్యా!' అన్నాడు సవినయంగా.

నాకు ప్రాణం లేచి వచ్చినట్టయ్యింది. 'నేను నిన్ను గుర్తుపట్టలేదోయ్....' అన్నాను.

'నేనుబాబయ్యా, చలమయ్యా?'

చలమయ్య పేరు నాకు సుపరిచితమే! వాడు పెద్ద దొంగని, మా నాన్న చెప్తూవుండేవారు. వూళ్ళో అందరికీ, వాడిగురించితెలుసు. వాడు చాలాసార్లు జైలు కెళ్ళి వచ్చాడు. అయితే, వాడిలో ఒకసుగుణంవుందని మా నాన్న అంటుండేవారు. తెలిసున్న వాళ్ళని వాడు దోమకోడు. ఆ నిజాయితీ వాడిలోవుంది. నాకు ధైర్యం వచ్చేసింది.


'నువ్వా చలమయ్యా' అర్జంటు పనుండి పట్నంలో యింతవేళవరకూ వుండిపోవల్సి వచ్చిందోయ్. నువ్వా గాబట్టి సరిపోయింది. మరింకెవరైనా అయితే, మా గతేం కాను?' అన్నాను.

'రోజులేం బాగోలేవు బాబయ్యా' ఇయ్యాలవచ్చేసేరుగాని, యెప్పుడూ యింక రాత్రిపూట యీ తోవ న రాకండి. పాతరోజులు కావుబాబూ! మారిపోనాయి. పదండి బాబయ్యా. తమరితోపాటు ఆల్లంత దూరం వత్తాను....' అన్నాడు చలమయ్య.

చలమయ్య దొంగే అయినా, వాడిలోవుండే నీతికీ, సహృదయతకూ, మనసులో జోహారు లర్పించాను. అంతలో రాజారావు కోపగించుకున్నాడు.

'ఎందుకులే చలమయ్యా, ఇద్దరం వున్నాంగా! వెళ్ళిపోతాంఅన్నాడు.

చలమయ్య మాత్రం వినిపించుకోలేదు. 'మీకు తెల్దు బాబయ్యా; కరువు పెరిగిపోతావుంటే, మనుషుల్లోనూ డబ్బుకోసం యావ పెరిగిపోతావుంది. ఈమధ్య శానామంది దొంగతెనాలు నేర్చినారు. ఎవరి బుద్ధి యెట్టాగుంటావో, యెవరికి తెల్సు? అందాకా వస్తాను, పదండి బాబయ్యా' అంటూ మాముందే నడిచాడు.




నేనేంమాటాడలేక పోయాను. నా మెదడులో ఆలోచనలన్నీ చలమయ్యను గురించే. దొంగల్లో కూడా చలమయ్యలాంటి వ్యక్తులుంటారని, యెప్పుడూ వూహించలేదు.

'పెద్ద ప్రమాదం తప్పింది రాజారావ్....' అన్నాను మెల్లగా.

'ఔనండీ,' ముక్తసరిగ అనేసి వూరుకున్నాడు, రాజారావు.

నేను యేం చెబుతున్నా, 'వూ' కొడుతున్నాడే తప్పించి, మరేం మాట్లాడలేదు రాజారావు. నాకు ఆశ్చర్యమేసింది.

'ఏవిఁటి రాజారావ్, అంత పరధ్యానంగా వున్నావు?' వుండబట్టలేక అడిగాను.

కాస్తంత తడబడ్డాడు, రాజారావు. 'అబ్బే; ఏవీఁలేదండీ, మనల్ని అటకాయించిన వ్యక్తి, చలమయ్యే కాకుండావుంటే, మన పరిస్థితి యేవిఁటా అని ఆలోచిస్తున్నాను....' అన్నాడు.

'అదే నేనూ అనుకుంటున్నాను' అని నేను అన్నానో లేదో మామిడిచెట్ల చాటునించి ఓ నలుగురువ్యక్తులు కర్రలతో వచ్చి మమ్మల్ని అడ్డారు.

నాకేం పాలుబోవడం లేదు. ఇవ్వాళ యెందుకిట్లా జరుగుతుందా అన్న ఆలోచనలతో, నాకు మతిపోయినట్టనిపించింది.

చలమయ్య కూడా షాక్ తిన్నట్టున్నాడు.

'ఈ చలమయ్యని ఆపే మొనగాడెవడ్రా?' అంటూ మొల్లో దోపిన కత్తిని తీశాడు చలమయ్య.

చలమయ్య గొంతు సింహగర్జనలా వినిపించేసరికి, ఆ నలుగురూ బెంబేలెత్తిపోయారు. కంగారుగా పరుగు లంకించుకున్నారు. చలమయ్య మెరుపులా వెళ్ళి, ఒకణ్ణి పట్టుకున్నాడు. అడాపెడా నాలుగు తగిలించేసరికి, వాడొచ్చి నా కాళ్ళమీద పడ్డాడు.

'రచ్చించండి బాబూ' అన్నాడు శరణుజొచ్చిన వాడిలా.

'బాబుగార్ని దోసుకోడానికొచ్చార్రా? మీకెన్ని గుండెలుండాల్రా?' అన్నాడు చలమయ్య, వాడి జబ్బపట్టుకుని పైకెత్తి.

వాడు వొణికిపోతూ,

'సెలమియ్యా, మాకా వుద్దేశం నేదు. ఇదిగో, ఈ రాజారావ్ బాబే మాకు పురమాయించారు. రామారావు గోరు యియ్యాల డబ్బు తీసుకుని పట్నంనించి వస్తారని, అయన్ని అడ్డగించి, ఆ డబ్బు కాజెయ్యమని సెప్పారు. మాకు సెరోవందా యిస్తామన్నారు.... ఋద్ధి గడ్డితిని వవ్పుకున్నాం....' అన్నాడు.

నిర్ఘాంతపోయాన్నేను. ఇది నిజమేనా?.. అనిపించింది. నాచెవుల్ని నేనే నమ్మలేకపోయాను. సినీమా చూసిపోదామని రాజారావు పురమాయించినవైనం, చలమయ్యని తమతో రావొద్దని వారించిన విషయం గుర్తుకొచ్చాయి. ఓ పురుగును చూసినట్టుగ రాజారావుకేసి చూశాను. అయితే, రాజారావు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్న ప్రయత్నం చేశాడు. ఆ దొంగకేసి వురుముతూ వెళ్ళి-

'నోర్ముయ్‌రా వెధవా! నువ్వెవడవో నాకు తెలీదు, నిన్ను నేను పురమాయించడమేవి(టి? నోటికొచ్చినట్టంతా పేలితే, నాలుక పీకించేస్తాను, తెలుసా?' అన్నాడు వుక్రోషంతో.

'రాజారావ్, అబద్ధాలు చెప్పినిన్ను నువ్వు కాపాడుకోడానికి యెందుకు వ్రయత్నిస్తావు చెప్పు? దొంగలే అయినా, వీళ్ళలో యెంత నిజాయితీ వుందో, మనం చలమయ్యని ఉదాహరణగా తీసుకుని చెప్పొచ్చు. వాళ్ళకున్న నీతి, నిజాయితీ, నీకు లేకపోవడం శోచనీయం' అన్నాను కోపంగా.

'నన్ను అపార్థం చేసుకుంటున్నారు రామారావుగారూ! ఎవడో దొంగవెధవ చెప్పింది నిజంగా నమ్మేసి, పరిచయస్నుణ్నయిన నా మాట కొట్టిపారేస్తునారు. ఇది

భావ్యంగా లేదు. వీడెవడో నాకు తెలీదు. నేను వీడికి చెప్పడమేవిఁటి?' అంటూ మళ్ళీ దొంగకేసి వురుముతూ చూసి 'నిజం చెప్పరా! కళ్ళు పీకేస్తాను.... దొంగరాస్కెల్' అన్నాడు.

అయితే, యీ పర్యాయం ఆ దొంగ నోరుమూసుకు వూరుకోలేదు.

'రాజారావుగోరూ, వూరుకుంటుంటే, మరీ నోరు పారేసుకుంటున్నారేటండీ? సత్తెపెమాణంగా సెప్పండి - యీరోజు తెల్లారేసరికి మా యీరయ్య దగ్గరికొచ్చి మీరు సెప్పనేదుటండీ, రామారావుగోరు డబ్బుతో వస్తారు....అర్ని దోసుకోమని. ఆ దొంగతనం సెలమయ్య మీదే తోసెయ్యొచ్చని మీరే సెప్పారు గదండీ? ఎందుకండీ అబద్దం..' నిర్భయంగానే చెప్పాడు వాడు.

చలమయ్య 'కఁయ్' మన్నాడు. వాడికి యీసారి నిజంగా కోపం వచ్చింది.

'ఏటేటి? ఈ దొంగతనం నా మీద తోసెయ్యడానికా? ఇదాబాబూ, మీయెత్తు? మిమ్మల్ని యిడిసి పెట్టకూడదు. రామారావు గోరూ, తవఁరు సెలవిప్పించండి-యీ బాబుని పచ్చడిచేసి పంపిత్తా. మరెప్పుడూ యిల్లాంటి ద్రోహం తల పెట్టరీయన....' అన్నాడు కోపంగా.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో చలమయ్య స్వరం చాలాకటువుగా వినిపించింది. నిజంగా రాజారావుని వచ్చడి చేస్తాడనిపించింది.

'ఎందుకులే చలమయ్యా! ఇటువంటివాణ్ణి కొట్టడం, నీకేచిన్నతనం. దొంగవని పేరుపడ్డ నీలో వున్న పాటి నీతి, యీ రాజారావుకి లేకపోయింది. కనీసం, యీసంఘటన జీవితాంతం గుర్తుంచుకుంటే, అతడికి అదేశిక్ష! నీ మేలు యెన్నటికీ మర్చిపోను చలమయ్యా! ఇదిగో యీ యిరవై రూపాయలుంచుకో!' అంటూ రెండు పదిరూపాయల నోట్లుతీసి చలమయ్యకి అందించాను.

కాని, చలమయ్య చప్పున తీసుకోలేదు. 'వద్దు బాబయ్యా! మీ వుప్పు కారం యెప్పుడూ తింటున్నవాళ్ళమే!' అన్నాడు.

'అయినా, నా తృప్తికోసం వుంచుకో చలమయ్యా! డబ్బు కాదు ప్రధానం.... మనిషివిలువ. కడుపు నింపుకోడానికి దొంగతనం చేస్తున్నావుగాని, నిజానికి నువ్వు దొంగవు కావు. సంఘంలో నీకంటె గొప్ప గొప్ప దొంగలు యెంతోమంది

వున్నారు. వస్తా....' అంటూ చలమయ్య చేతిలో ఆ డబ్బు పెట్టాను.

'వూరు చివరివరకూ వస్తాను పదండి బాబయ్యా!' అంటూ నాతో పాటు వచ్చాడు, చలమయ్య.

రాజారావు వస్తోందీ, లేందీనాకు అవసరం లేకపోయింది. అటువంటి వ్యక్తితో యిన్నాళ్ళూ పరిచయం వున్నందుకు, నాకే సిగ్గువేసింది. రాజారావు, ఆ దొంగ యేదోఘర్షణ పడుతున్నట్టు అస్పష్టంగా వినిపిస్తూ వుంటే, నేను సాగిపోయాను. వూరు పొలిమేరలవరకూవచ్చి, చలమయ్య వెళ్ళిపోయాడు.

మరుచటిరోజు తెలిసింది, రాజారావు యెక్కడికో వెళ్ళిపోయినట్టు. అయితేనేం- అతడిగురించి నేనంతగా పట్టించుకోలేదు. రాత్రిజరిగిన సంఘటన గురించి కూడా యెవరికీ చెప్పలేదు.

ఈ రోజుల్లో నిజమైన దొంగలు యెవరో గుర్తుపట్టడంకష్టమని, ఆసంఘటన నాకు తెలియజేసింది. అందుకే, ఆ సంఘటన్ని యెప్పటికీ మర్చిపోలేను.


Phone : 954

## శ్రీనివాస్ ఇంజనీరింగు కంపెనీ

రాజమండ్రి

**డీలర్సు : జ్యోతి మోనోబ్లాక్ పంపుసెట్లు, జ్యోతి మోటార్లు, డీప్ వెల్ జెట్ పంపులు, ఎలక్ట్రికల్ మోటార్లు, రైస్ మిల్లు సామాన్లు, బోరింగు పైపులు, 4" నుండి 12" అంగుళ రింగు పైపులు, స్లాటింగు పైపులు, ఫిల్టరు పాయింట్లు, పంపులు, శానిటరీ ఫిటింగులు, పైపు ఫిటింగులు, ఆల్ కాతిన్ పైపులు**

**సరసమైన ధరలకు దొరకును**

పార్టనర్సు : మేడూరి సత్యనారాయణ & కో

కొండూరి కృష్ణార్జునరావు.